చరిత్రకు ఆనవాళ్లు

- బొమ్మనపల్లి, సుందరగిరి, రామంచ గ్రామాల్లోని గడికోటలు
- శత్రువుల రాకను పసిగట్టేందుకు నిజాం కాలంలో నిర్మాణం
- పర్యాటకంగా తీర్చిదిద్దాలని కోరుతున్న ప్రజాప్రతినిధులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి, సుందరగిరి, రామంచ గ్రామాల్లో నిజాం కాలంలో నిర్మించిన గడికోటలు నేటికి చెక్కుచెదరడం లేదు. రాతి కట్టడాలు, మట్టిగోడలు చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. నిజాం నవాబు కింద పనిచేసే రజాకార్లు శత్రువుల రాకను పసిగట్టేందుకు గడికోటలపై నిలబడి కాపలాకాసేవారని, గ్రామాల్లోకి ఎవరూ రాకుండా నిలువరించేందుకు ఎంతో ఉపయోగపడ్డాయని పెద్దలు చెబుతుంటారు. గడి కోటల్లో కావాల్సినంత ఖాళీ స్థలం ఉంది. సుందరగిరి గడికోటలో దాదాపు 30 గుంటల నుంచి ఒక ఎకరం వరకు ఖాళీ స్థలం ఉంది. ఈస్థలంలో మహిళా మండలి భవనం నిర్మించగా నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని కూడా నిర్మిస్తున్నారు. బొమ్మనపల్లి గడికోటలో గ్రామ పంచాయతీ కార్యాలయం భవనం నిర్మించారు. బాలవికాస పథకం కింద రక్షిత మంచినీటి పథకం కొనసాగిస్తున్నారు. మరోవైపు అంగన్‌వాడీ భవనం కొనసాగుతోంది. ఖాళీ స్థలంలో టేకు మొక్కలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నాటగా వృక్షాలుగా మారి ఆదాయం సమకూరుతోంది. మరోపక్క మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించారు. రామంచలో గడికోట మధ్యలో ఖాళీ స్థలం ఉంది. బొమ్మనపల్లి, సుందరగిరి గ్రామాల్లోని గడికోటలు ధ్వంసమవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.

కూలుతున్న మట్టి గోడలు

మూడు గ్రామాల్లో గడికోటలు కూలుతున్నాయి. కింద భాగాన ఉన్న రాతికట్టడాలు సరిగానే ఉన్నప్పటికి పైన నిర్మించిన మట్టిగోడలు మాత్రం కొద్దికొద్దిగా కూలుతున్నాయి. వర్షాకాలంలో మట్టి కిందికి రాలుతోంది. మరో పదేళ్లయితే పూర్తిగా గోడలు దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడికోటలకు నాలుగు వైపుల శత్రువులను పసిగట్టేందుకు పెద్ద పెద్ద రంధ్రాలున్నాయి. ఈ గడికోటల పైకెక్కి చూస్తే చుట్టూ పక్కల గ్రామాలు కనిపిస్తుంటాయి. ఆరోజుల్లో శత్రువులను కనిపెట్టడం గొప్ప విషయమని పెద్దలు అంటున్నారు. గడికోటల పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పలువురు మేధావులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మట్టి గోడలు కూలకుండా, అలాగే పర్యాటకులకు కనువిందు చేసేలా తీర్చిదిద్దాలని పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.


బొమ్మనపల్లిలోని బురుజు

చర్యలు తీసుకోవాలి



సుందరగిరిలో గడికోటలు ధ్వంసమవుతున్నాయి. జీపీ నిధులు వెచ్చించి మరమ్మతు చేసేందుకు ఎలాంటి అధికారం లేదని చెబుతున్నారు. ఈవిషయంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాటి రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలి.
– తాళ్లపల్లి సంపత్, సుందరగిరి

మరమ్మతు చేయిస్తాం



బొమ్మనపల్లి గడికోట పరిరక్షణకు జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేస్తా. చరిత్ర ఆనవాళ్లు దెబ్బతినకుండా మరమ్మతు చేయిస్తాం.
– కత్తుల రమేశ్, మాజీ ఎంపీటీసీ, బొమ్మనపల్లి

పట్టించుకోవడంలేదు



మా ఊరి గడికోట కొంతవరకు దెబ్బతిన్నది. కలెక్టర్ వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. గతంలో కొందరు ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. మంత్రి గంగుల కమలాకర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు కోసం నావంతు కృషి చేస్తా.
– దొబ్బల బాబు, యువజన సంఘం నాయకుడు, రామంచ

క్లుప్తంగా

చెక్కులు పంపిణీ



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. వెంట పీఏసీఎస్ చైర్మన్ కొండాల్‌రెడ్డి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాలుగా ప్రకటించాలి


మాట్లాడుతున్న నాగిశేఖర్

గంగాధర: నారాయణపూర్ రిజర్వాయర్ నిర్మాణంతో ఇబ్బందులకు గురయ్యే నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి గ్రామాలను ప్రభుత్వం వెంటనే ముంపు గ్రామాలుగా ప్రకటించాలని యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ డిమాండ్ చేశాడు. శనివారం మండలంలోని నారాయణపూర్ చెరువును సందర్శించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు భయంభయంగా జీవిస్తున్నారని ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయం జరగకుంటే ఆందోళనలు చేపడతామన్నారు. వెంట నాయకులు నీలం కిషన్, గుర్రం రాము,నవీన్, సాయి, మణిదీప్, లక్ష్మణ్, కొమురయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు జమ్మి వాగుకు గండి పడటంతో దిగువన ఉన్న పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయని గ్రామానికి చెందిన బావు రజిత ఆవేదన వ్యక్తం చేశారు. 137, 138, 139 సర్వే నంబర్లలోని భూములలో మట్టి పేరుకుపోయిందని, నాటు వేసిన పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, యాసంగిలో వడగండ్ల వానకు పంట పూర్తిగా దెబ్బతిందని పరిహారం కూడా రాలేదని కన్నీరుమున్నీరైంది. ఇప్పుడైనా ప్రభుత్వం పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దెబ్బతిన్న వంతెన పరిశీలన


వంతెనను పరిశీలిస్తున్న యాదగిరి

రామడుగు: భారీ వర్షాలతో మండల కేంద్రం సమీపంలో మోతె వాగుపైన ఉన్న పాత వంతెనను శనివారం కొండగట్టు దేవస్థానం ఆలయాభివృద్ధి కమిటీ డైరెక్టర్ బండపల్లి యాదగిరి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వంతెన ధ్వంసమైందని, కొత్త వంతెన పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ గన్నేరువరం మండల అధ్యక్షుడిగా అజయ్


నియామకపత్రం అందిస్తున్న కవ్వంపల్లి

గన్నేరువరం: యూత్ కాంగ్రెస్ గన్నేరువరం మండల అధ్యక్షుడిగా ముడికె అజయ్‌కుమార్ నియామకమయ్యారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీసీ అధ్యక్షుడితో పాటు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్, పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సునీల్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి అనిల్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహేష్, మానకొండూర్ కార్యదర్శి నవీన్, నాయకులు, కార్యకర్తలకు అజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

చెట్టు తొలగింపు



సాక్షి స్పందన

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి శివారులో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు రావిచెట్టు నేలవాలింది. వెంటనే పోలీసులు చెట్టును జేసీబీ సహాయంతో పక్కకు నెట్టారు. చెట్టును పూర్తిగా తొలగించక పోవడంతో రాత్రివేళ ప్రమాదం పొంచి ఉందని శుక్రవారం 'సాక్షి' ఫొటో స్టోరీ ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు చెట్టును తొలగించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

పెద్ది సుష్మకు డాక్టరేట్



హుజూరాబాద్: పట్టణానికి చెందిన అధ్యాపకురాలు పెద్ది సుష్మకు రాజస్థాన్‌కు చెందిన జగదీశ్‌ప్రసాద్ జబర్మల్ టిబ్రేవాలా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ విభాగంలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న సుష్మ డాక్టర్ ఎస్‌కే యాదవ్ పర్యవేక్షణలో 'పర్ఫార్మెన్స్ అండ్ ఏ వాల్యుయేషన్ ఆఫ్ ఎన్ఫోర్‌మెంట్ లర్నింగ్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్'అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ మధుమిత తెలిపారు. ఈసందర్భంగా ఆమెకు కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ రెడ్డి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి


సమ్మెకు ధర్మ సమాజ్ పార్టీ నాయకుల మద్దతు


శంకరపట్నం: కేశవపట్నంలో రాస్తారోకో

గన్నేరువరం: గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని వైఎస్సార్‌టీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జాగిరి శ్రీనివాస్ కోరారు. మండలంలోని గునుకులకొండాపూర్‌లో మాట్లాడారు. కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జీవో 51 సవరించి, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. నెలకు రూ.25 వేల వేతనం, రూ.పది లక్షల ప్రమాద బీమా సౌకర్యం వర్తింపచేయాలని కోరారు.

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మె 24వ రోజుకు చేరింది. భూపాలపల్లి జిల్లా పెద్దమ్మపల్లి గ్రామానికి చెందిన కారోబార్ రాజు గుండెపోటుతో మృతిచెందగా శనివారం కార్మికులు నివాళి అర్పించారు. ప్రభుత్వం కార్మికులపై మొండిగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రమేశ్, సంపత్, శ్రీనివాస్, అంజన్‌కుమార్, మల్లయ్య, శేఖర్, గోపాల్, పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై కార్మికులు రాస్తారోకో చేశారు. ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. రాస్తారోకోతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు రాస్తారోకో విరమింపచేశారు. మల్లేశం, సారయ్య, తిరుపతిరావు, సమ్మయ్య పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మెకు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. చాలీచాలని జీతాలతో కార్మికులు పనిచేస్తున్నారని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు.

జమ్మికుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు, సిబ్బంది పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద వంటావార్పుతో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులపై కనికరం చూపడం లేదని చర్చలకు పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రవీందర్‌రావు, అసాల సారయ్య, స్వామి, మహిపాల్‌రెడ్డి, సంతోష్, పరుశరాములు, రమేష్, ప్రవీణ్, మధుకర్, రాము, సతీష్ కార్మికులు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించాలని వినతి

శంకరపట్నం: కల్వల ప్రాజెక్టుకు గండి పడి చేపలు కొట్టుకుపోగా రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని మత్స్యకారులు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని గద్దపాక గ్రామంలో 80 మత్స్యకారుల కుటుంబాలు ఉన్నాయని, ప్రాజెక్టుకు గండిపడటంతో ఉపాధి కోల్పోయామని, పరిహారం అందించి ఆదుకోవాలని విన్నవించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి పంటలను కాపాడాలని రైతులు కోరారు.

వీణవంక: ఇటీవల కురిసిన వర్షాలకు కనపర్తి గ్రామం నుంచి వీణవంకకు వెళ్లే రోడ్డు పూర్తిగా తెగిపోగా శనివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్‌బాబు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సర్పంచులు పర్లపల్లి రమేష్, నీల కుమార్, బీఆర్ఎస్ నాయకులు మాడ సాధవరెడ్డి, ముసిపట్ల తిరుపతిరెడ్డి, కలకొండ మధుకర్‌రెడ్డి, కట్కూరి మదుసుదన్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, అశోక్ తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేయాలి


నిరసన తెలుపుతున్న మేడిపల్లి సత్యం

రామడుగు: ఐదేళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. పాత బ్రిడ్జి కుంగడంతో మండల కేంద్రానికి వెళ్లలేని దుస్థితి నెలకొందని బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కుంగిన వంతెనపై బైఠాయించి నిరసన తెలిపారు. పదిహేను రోజుల్లో వంతెన నిర్మించకుంటే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడగామని హెచ్చరించారు. అనంతరం రుద్రారం వంతెనతో పాటు చెక్ డ్యామ్‌లతో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. పార్టీ మండల అధ్యక్షులు బి.తిరుపతి, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, డీసీసీ అధికార ప్రతినిధి కాడె శంకర్, నాయకులు పంజాల శ్రీనివాస్‌గౌడ్, బాపు రాజు, కట్ల శంకర్, రాములుగౌడ్, తోట రవి, శ్రీనివాస్, బాబు, అనిల్, రాజశేఖర్ పలువురు పాల్గొన్నారు. రామడుగులో సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం తక్షణం జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా మొహర్రం


మొలంగూర్‌లో మొహర్రం వేడుకలు


రామడుగు: గుండిలో ఎమ్మెల్యే రవిశంకర్


రాజాపూర్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో శనివారం మొహర్రం వేడుకల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొన్నారు. మొహర్రం హిందూ, ముస్లింలు ఘనంగా జరుపుకుంటారని తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్, రాజాపూర్ గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొన్నారు. కేశవపట్నం, తాడికల్, కన్నాపూర్, కరీంపేట తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. రాజాపూర్‌లో ఎమ్మెల్యే పీరీలను మోసి మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, విండో చైర్మన్ సంజీవరెడ్డి, తదితరులు ఉన్నారు.

హుజూరాబాద్‌రూరల్: కులమతాలకతీతంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో మొహర్రం జరుపుకున్నారు. ముస్లింలు ఉపవాసదీక్షలు, మసీదుల్లో ప్రార్థనలు చేశారు. సాయంత్రం పీరీలను పురవీధుల గుండా ఊరేగించి నిమజ్జనం చేశారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలు డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపులో పాల్గొన్నారు. రంగాపూర్ మొహర్రం వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ధర్మరాజుపల్లిలో ముస్లింలు లేకున్నా కులమతాలకతీతంగా హిందూ, ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా నిలిచే మొహర్రంను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

మానకొండూర్: మండలంలో ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు పీరీలను ఊరేగించారు. సాయంత్రం వేళ కులమతాలకు అతీతంగా ఆటలు ఆడుతూ మొహర్రం జరుపుకున్నారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో మొహర్రం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. హిందూ, ముస్లింలు పీరీలకు మొక్కులు చెల్లించారు.

జమ్మికుంట: హజ్రత్ ఇమామె హుస్సేన్, 72 మంది శిష్యులు మూడు రోజుల కర్బలా యుద్ధ మైదానంలో అమరులయ్యారని, వారి వీర మరణాన్ని గుర్తు చేసుకుంటూ పట్టణంలో మొహర్రం పురస్కరించుకొని షర్బత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువకులు మహ్మద్ జాఫర్, జియా ఉల్ అలీ, జమీర్, పకీర్, అఫ్రస్, జునైద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు


స్వీట్లు పంపిణీ చేస్తున్న జాడి బాల్‌రెడ్డి

రామడుగు: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై శనివారం మండల కేంద్రంలో పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు భాస్కరాచారి, లక్ష్మణ్, రవీందర్, రామ్, శ్రీకాంత్, భరత్, మల్లేశం, జితేందర్, అంజిబాబు, సాయి, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని బీజేపీ నాయకులు మధురానగర్ చౌరస్తాలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోల అశోక్, ఎడవెల్లి శిశిధర్,మిట్ట మధు, పెంచాల రాములు, శ్రీపతి రాజేంద్రప్రసాద్, రేండ్ల శ్రీనివాస్, గుండేటి మల్లేశం, పెరుక మహేశ్, అనిల్‌రెడ్డి, ఆకుల మనోహర్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం


నియామకపత్రం అందిస్తున్న నాయకులు

జమ్మికుంట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన సుక్కల గంగాభవానీ నియామకమయ్యారు. ఈమేరకు ఉమ్మడి కరీనగర్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం పటేల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి సహకరించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌కురమ, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాసచారికి గంగాభవానీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా భూమి పట్టా చేసుకున్నాడని..

- పురుగు మందు డబ్బాలతో ఇంటి ఎదుట బైఠాయింపు


శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ఎదుట పురుగుమందు డబ్బాలతో బాధితులు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి నమ్మించి తన భూమి అక్రమంగా పట్టా చేసుకున్నాడని సదాశివపల్లి గ్రామానికి చెందిన అన్నాడి రాజన్న, తిరుపతిరెడ్డి, రాజు కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ముందు శనివారం సాయంత్రం ఇంటి ముందు పురుగుమందు డబ్బాలతో బైఠాయించారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. అన్నాడి రాజన్న, తిరుపతిరెడ్డి, రాజుకు ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి దగ్గరి బంధువు. వీరికి సంబంధించిన 1.09 గుంటల భూమిని శ్రీనివాస్‌రెడ్డి పట్టా చేసుకున్నాడని ఆరోపిస్తూ ఆయన ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. వీరి మధ్య వాగ్వాదం జరగడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురితో మాట్లాడి గొడవ సద్దుమణిచారు. శ్రీనివాస్‌రెడ్డిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నమ్మించి భూమి పట్టా చేసుకోవడమే కాకుండా రూ.పది లక్షలు తీసుకున్నాడని బాధితులు వాపోయారు. మా భూమి మాకు పట్టా చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

మానకొండూర్‌లో ఉచిత వైద్యశిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మానకొండూర్: మానకొండూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో హెల్త్ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది ఈసీజీ, బీపీ, షుగర్, తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది విజయ్‌కుమార్, కిరణ్, అనూష, పద్మ పాల్గొన్నారు.

సమాచారం



31 నుంచి పశువైద్య శిబిరాలు

రామడుగు: మండలంలో జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ప్రత్యేక పశువైద్య శిబిరాలను నిర్వహించనున్నామని మండల పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శిబిరాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూలై 31న రామడుగు, కొక్కెరకుంట, ఆగస్టు 2,3,4 తేదీల్లో షానగర్, పందికుంటపల్లి, దేశరాజ్‌పల్లి, 5న శ్రీరాములపల్లి, 6న మోతె, గోలిరామయ్యపల్లి, 8, 9న వెలిచాల, రుద్రారం, 10,11,12,13వ తేదీల్లో రంగసాయిపల్లి, కోరటపల్లి, వన్నారం, 14న దత్తోజీపల్లి, 17,18,19వ తేదీల్లో గోపాల్‌రావుపేట, కిష్టాపూర్, 20న గుండి, 22, 23, 24, 25వ తేదీల్లో లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లి, వెదిర, 26, 27, 28వ తేదీల్లో చిప్పకుర్తి, రాంచెంద్రాపూర్, 29, 30, 31వ తేదీల్లో తిర్మలాపూర్ గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామని వివరించారు. రైతులు విధిగా పశువులకు టీకాలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

సైదాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నామని పశువైద్యాధికారి విజేందర్‌రావు శనివారం తెలిపారు. జూలై 31న వెన్కెపల్లి, ఆగస్టు 1న సైదాపూర్, 2న వెన్నంపల్లి, 3న దుద్దెనపల్లి, 4న జాగీర్‌పల్లి, 5న ఆరెపల్లి, వెంకటేశ్వర్లపల్లి, 7న రాయికల్, 8న రాయికల్ తండా, 9న ఎగ్లాస్‌పూర్, 10న ఎలబోతారం, 11న రాంచంద్రాపురం, 12న రాములపల్లి, 14న ఎల్లంపల్లి, 16న సోమారం, 17న గుజ్జులపల్లి, 18న గొడిశాల, 19న నల్లరామయ్యపల్లి, 21న లస్మన్నపల్లి, 22న బొమ్మకల్, 23న అమ్మనగుర్తి, గుండ్లపల్లి,24న ఘనపూర్, 25న ఆకునూర్, 26న పెరుకపల్లి, 28న సర్వాయిపేటలో టీకాలు వేస్తామని వివరించారు.

ఆగస్టు 3న ప్రవేశపరీక్ష



చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ఖాళీల భర్తీకి ఆగస్టు 3న పాఠశాల ఆవరణలో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం చిగురుమామిడిలో మాట్లాడారు. మండలంలోని 17 గ్రామాలకు చెందిన విద్యార్థులు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన క్లస్టర్ లెవల్ ఎగ్జిబిషన్ మీట్

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ లెవల్ ఎగ్జిబిషన్ మీట్ ముగిసింది. వివిధ విభాగాల్లో 21 ఎగ్జిబిట్లను ఎంపిక చేశారు. కేరళలోని ఎర్నాకులంలో జరిగే రీజినల్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు హాజరవుతారని ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. క్లస్టర్ లెవల్ అథ్లెట్ మీట్‌లో 108 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణలోని అన్ని జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జేఎన్‌వీలో జరిగే రీజినల్ స్థాయి అథ్లెట్ మీట్‌కు యాభై మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. న్యాయ నిర్ణేతలకు, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.